కొనలేం.. తినలేం

- ఫైపైకి బియ్యం, కందిపప్పు ధరలు
- కర్నూలు సోనా రకాల బియ్యం ధర కేజీ రూ.68 పైమాటే
- బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిపప్పు ధర రూ.195
- ధరల నియంత్రణను గాలికొదిలిన ప్రభుత్వం
- తూతూమంత్రంగా నిత్యావసర స్టాళ్ల ఏర్పాటు

పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఏమీ కొనేటట్లు లేదు. తినేటట్లు లేదు. ఒక పక్క నిత్యావసర సరుకుల ధరలు.. మరోపక్క కూరగాయల ధరలు రోజురోజుకు ఎగబాకుతూ పోతుండడంతో దిక్కుతోచడం లేదు. నియంత్రించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యం రకాల్లో ధర కేజీ రూ.68పైనే. అదే సమయంలో బ్యాళ్ల ధరలు కూడా ఒక్కసారిగా పెరిగాయి. 20 రోజుల క్రితం వరకు బ్యాళ్ల ధర తక్కువగా ఉండేది. ప్రస్తుతం కేజీ కందిపప్పు ధర రూ.195 పలుకుతుండడంతో వినియోగదారులు జడుసుకుంటున్నారు.

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో 4,66,348 కుటుంబాలు ఉన్నాయి. వాటిలో 22,71,686 మంది జనాభా ఉన్నారు. ఇందులో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలే. కర్నూలు జిల్లా సోనామసూరి బియ్యానికి నిలయం. ఇక్కడి బియ్యాన్ని అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్, గల్ఫ్ దేశాలకు సైతం ఎగుమతి చేస్తారు. సీజన్‌లో ఇక్కడ క్వింటాల్ రూ.3000–3500 ధర పలుకుతుంది. బియ్యం పాతబడితే అంటే ఐదారు నెలలు గడిస్తే అప్పుడు ధర మరో రూ.1000–1500 వరకు పెరుగుతుంది. పాత బియ్యం సరాసరిగా క్వింటాల్ రూ.5000లకు లభిస్తుంది. అయితే ఆ ధరలు ఇప్పుడు లేవు. ఏకంగా క్వింటాల్ బియ్యం ధర రూ.6800–7000 మధ్య ఉండడంతో పేదల గుండెలు గుబేల్ మంటున్నాయి. సామాన్య మానవుడు కొనలేని స్థితికి ధరలు పెరిగిపోవడంతో దిక్కుతోచడం లేదు.



ధరల నియంత్రణపై ధ్యాస లేదు

జిల్లాస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ ఉంటుంది. దీనికి జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమై బియ్యం, బ్యాళ్లతోపాటు అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలపై సమీక్ష చేయాల్సి ఉంటుంది. అయితే ఈ కమిటీ సమావేశాలు సక్రమంగా జరగడంలేదు. దీన్ని అలుసుగా తీసుకొని కొందరు మిల్లర్లు బియ్యం ధరలు పెంచినట్లు తెలుస్తోంది. అదే సమయంలో గతేడాది వర్షాభావంతోనూ అనుకున్నంతగా దిగుబడి రాలేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం ధరలు పెరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉండేది. అది జరగకపోవడంతో బియ్యం, బ్యాళ్ల ధరలు పెరిగిపోతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.



తూతూమంత్రంగా చౌకధర స్టాళ్ల ఏర్పాటు

బహిరంగ మార్కెట్‌లో బియ్యం, బ్యాళ్ల ధరలు అమాంతంగా పెరిగి పోతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ధరల నియంత్రణ కోసం తక్కువ ధరకు బియ్యం, బ్యాళ్లను అందించాలని నిర్ణయించారు. సోనామసూరి స్టీమ్డ్ బియ్యం కేజీ రూ.49, సోనామసూరి పచ్చిబియ్యం కేజీ రూ.48. దేశవాళీ కంది పప్పు కేజీ రూ.160 చొప్పున ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. తక్కువ ధరకు బియ్యం, బ్యాళ్లను ప్రజలకు అందించేందుకు కర్నూలు, ఆదోనిల్లోని రైతు బజార్లతోపాటు సూపర్ మార్కెట్లలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో కర్నూలులో రెండు రైతు బజార్లు, 5 సూపర్‌మార్కెట్లు, ఆదోనిలో ఒక్క రైతు బజార్‌లో మాత్రమే స్టాళ్లను ఏర్పాటు చేశారు. దీంతో తక్కువ ధరకు లభించే బియ్యం, బ్యాళ్లు కర్నూలు, ఆదోని పట్టణాల్లో మాత్రమే తూతూమంత్రంగా అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పట్టణాలు, గ్రామాల్లో మాత్రం బియ్యం కొనుగోలు చేయాలంటే వినియోగదారులు కేజీ బియ్యం కోసం రూ.68 వరకు, కేజీ బ్యాళ్ల కోసం రూ.195 చెల్లించాల్సిందే.

ధరల నియంత్రణకు చర్యలు



బియ్యం, కందిప్పు ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. రైతు బజార్లు, సూపర్ మార్కెట్లలో చౌక ధరకు బియ్యం, కందిపప్పును అందుబాటులోకి తెచ్చాం.కేజీ బియ్యం రూ.48/49. కందిపప్పు రూ.160లకు లభిస్తున్నాయి. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. – నారపురెడ్డి మౌర్య, జేసీ

కంది కప్పు ధర మండిపోతుంది



నెల రోజుల్లో బియ్యం, బ్యాళ్ల ధరలు అమాతంగా పెరిగాయి. కందిపప్పు కేజీ రూ.195 ధర పలుకుతోంది. ఇదే సమయంలో చౌకధరల దుకాణాల్లో కూడా ప్రభుత్వం బ్యాళ్లను వేయడంలేదు. దీంతో పప్పు తినాలంటే కేజీ బ్యాళ్ల కోసం రూ.195 చెల్లించి కొనుగోలు చేయాలి. పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని ధరలు తగ్గించాలి. – కె.జ్యోతి, గృహిణి, కర్నూలు

రూ.65 ప్రకారం కొనుగోలు చేశాను



గతంలో రూ.40–45 మధ్య ఉండే కేజీ బియ్యం ధర ఇప్పుడు రూ.68–70 మధ్య పలుకుతోంది. ఇటీవల నేను కేజీ రూ.65 ప్రకారం క్వింటాలు బియ్యం రూ. 6500కు కొనుగోలు చేశాను. అలాగే కందిపప్పు కేజీ రూ.190 పెట్టి కొనుగోలు చేశా. ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకొని బతికే మాలాంటి వాళ్లకు వచ్చే జీతమంతా బియ్యం, బ్యాళ్లకే సరిపోతే మిగతా ఖర్చులు ఎలా పెట్టుకోవాలి. – రాజశేఖర్,ప్రైవేట్ ఉద్యోగి

క్లుప్తంగా

తొలిరోజు బోణీ

- స్టాండింగ్ కమిటీకి నామినేషన్ దాఖలు

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీకి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా తొలిరోజు బోణీ అయ్యింది. 40వ వార్డు కార్పొరేటర్ ఎం.విక్రమసింహారెడ్డి గురువారం స్టాండింగ్ కమిటీకి సభ్యులుగా పోటీ చేసేందుకు తన నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 24వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. పలువురు కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీకి పోటీ చేసేందుకు నిర్ణయించుకుని ఆ దిశగా నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మూడు సంవత్సరాలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే స్టాండింగ్ కమిటీలో అవకాశం ఉండేది. ప్రస్తుతం టీడీపీ సభ్యులు కూడా పోటీకి దిగే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కర్నూలు నియోజకవర్గం అర్బన్ పరిధిలో ముగ్గురు, పాణ్యం నుంచి ఇద్దరు ఇప్పటివరకు స్టాండింగ్ కమిటీకి సభ్యులుగా కొనసాగారు. తాజాగా కోడుమూరు అర్బన్ నుంచి బరిలో ఉండే అవకాశం ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్ రెడ్డి, నాయకుడు ఇంతియాజ్ ఆశీస్సులు ఉన్న వారికే అవకాశం ఉంటుంది.

24న రోప్ స్కిప్పింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 10, 12, 14, 17, 19 సంవత్సరాల్లోపు బాల బాలికలకు వేర్వేరుగా ఉంటాయని వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ప్రవేశ రుసుం రూ.20, వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 99492 57657 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

క్రీడాకారులకు సహకారం

కర్నూలు (టౌన్): క్రీడాభివృద్ధి, క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని న్యాయవాది శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావుతో కలిసి సీనియర్, జూనియర్ అథ్లెటిక్స్ బాల బాలికలకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే చిన్నారులు చురుగ్గా, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. క్రీడాకారులు ప్రతిరోజు సాధన చేయాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సీబీడీ సీఐ నగేష్, సమ్మర్ క్యాంపు కోచ్ ఇస్మాయిల్ బాషా పాల్గొన్నారు.

హామీల అమలుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

కర్నూలు సిటీ: రైతు ఉద్యమం సందర్భంగా 2021లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా పార్లమెంటులో ఒత్తిడి తేవాలని అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు. ఈ మేరకు గురువారం ఆలిండియా కిసాన్ సంయుక్త మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు పంచలింగాలలోని ఆయన స్వగృహంలో ఎంపీకి వినతి పత్రం అందజేశారు. అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రైతులకు రుణామాఫీ, వ్యవసాయ మోటర్లకు మీటర్ల రద్దు, అన్ని పంటలకు సమగ్ర బీమా పథకం వర్తింపజేసేలా కృషి చేయాలని కోరారు. నాయకులు కె.జగన్నాథం, జి.రామకృష్ణ పోతుల శేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని విష్ణు టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కాలనీ ఏర్పాటై 18 సంవత్సరాలు గడిచినా కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని వాపోయారు. కాలనీలో మంచినీరు, రోడ్లు, దోమల నివారణ చర్యలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ గురువారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే స్వగృహంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వర్సిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పెద్దాసుపత్రి శుభ్రతకు చర్యలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణం, పరిసరాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను తనిఖీ చేశారు. వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. ఎంసీహెచ్ బ్లాక్ వద్ద నీరు నిలవకుండా ముందుకు పారేలా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌కు సూచించారు. ఐడీ వార్డు వద్ద ఉన్న న్యూ డంప్ యార్డ్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. నూతన డంప్ యార్డుకు చెత్తను తరలించాలని ఆదేశించారు. జీఈ వార్డు వద్ద ఉన్న డంప్ యార్డుకు మున్సిపల్ సిబ్బందిని ప్రతిరోజూ పంపి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించే విధంగా చూడాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో గైనిక్, ఇతర విభాగాల వద్ద డ్రైనేజీ పనులకు అంచనాలను రూపొందించాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. మేల్, ఫిమేల్ మెడికల్ వార్డుల్లో గ్రిల్, టైల్స్ వేయాలన్నారు. బాలాజీ క్యాంటీన్, విజయ పాలడైరీ వ్యర్థాలను ఆసుపత్రి ఆవరణలో వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వారిని హెచ్చరించారు. అంతకుముందు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలోని వైద్యులు, ఉద్యోగులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, ఆసుపత్రి ఏఓ శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

లోకేశ్ హామీ నిలబెట్టుకోవాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గతంలో ఇచ్చిన హామీ మేరకు నగర శివారులోని జ్యోతిరావు పూలే కాలనీలోని ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి కోరారు. ఈ మేరకు గురువారం మహిళా నేతలు కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2015లో నిరుపేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన 250 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, వారందరికీ గృహాలు నిర్మించి ఇస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలోనే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎంపీ నాగరాజు స్పందిస్తూ ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎంపీని కలిసిన వారిలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, నాయకురాళ్లు భారతమ్మ, పాలెం రాధ, షేక్ హుసేన్‌బీ తదితరులు ఉన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెరగాలి

కర్నూలు(హాస్పిటల్): కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెరగాలని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ పేర్కొన్నారు. గురువారం ముజఫర్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రతి కుటుంబంలోని మహిళలు, పురుషులను ఆశా, వలంటీర్ భౌతికంగా పరీక్ష చేసి వ్యాధి లక్షణాలు ఉంటే గుర్తించి వైద్యులకు రెఫర్ చేసి చికిత్స అందేలా చేస్తారన్నారు. జిల్లా న్యూక్లియర్ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై కణితులు, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్లలో పుండ్లు, చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు కుష్టు వ్యాధిగ్రస్తుల్లో ఉంటాయన్నారు. వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుప్రియ, డీపీఎంఓ హక్, సుబ్రహ్మణ్యం, ఫిజియోథెరపిస్ట్ రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మరుగుదొడ్లకు తలుపుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల శుశ్రుత భవన్‌లోని పైఅంతస్తులో ఉన్న ఎంఎస్–5లో మరుగుదొడ్లకు అధికారులు గురువారం తలుపులు బిగించారు. ఈ సమస్యపై 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మరుగుదొడ్లు శుభ్రం చేసి ఊడిన తలుపులను తిరిగి బిగించారు. సమస్య పరిష్కారం కావడంతో సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు కె.సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు జి.ఏసు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.



మరుగుదొడ్లకు తలుపులు బిగించిన దృశ్యం

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): జూలై 24, 25, 26 తేదీల్లో మదనపల్లెలోని హార్సిలీ హిల్స్‌లో జరిగే ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈ శిక్షణ తరగతుల్లో మునిసిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి పోరాటాలకు కార్యచరణను ప్రకటిస్తామన్నారు. పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్స్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ, సమ్మె కాలపు వేతనాల చెల్లింపుపై చర్చించనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యా, వైజ్ఞానిక సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులింగం మద్దిలేటి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, నగర ఉప ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునెప్ప

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- నెలాఖరులోపు అన్ని గ్రామాల్లో నీటి శుద్ధీకరణ, పారిశుద్ధ్య చర్యలకు ఆదేశం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని కలెక్టర్ పి.రంజిత్‌బాషా హెచ్చరించారు. ఆయన గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీజనల్ వ్యాధులు, ఉపాధి హామీ, ఇతర అభివృద్ధి పనులపై సబ్‌కలెక్టర్లు, ఆర్‌డీఓలు, జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఈఓఆర్‌డీలు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో పలు గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. అతిసార వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో నివారణ కోసం అధికారులు పకడ్బందీ ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. పారిశుద్ధ్య లోపం, నీటి కలుషితం వల్ల ఒక్క మరణం కూడా సంభవించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యం వీడి పనిచేయకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో రెండు గ్రామాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయని, అక్కడ ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. మండలాల అధికారులు షెడ్యూల్ రూపొందించుకొని ప్రతి వారం 4 గ్రామాలను సందర్శించి పారిశుద్ధ్య పనులు, నీటి ట్యాంకుల శుద్దీకరణ, క్లోరినేషన్‌పై దృష్టి సారించాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి పైపుల మరమ్మతులు చేపట్టాలని, మురుగునీరు కలిసే ప్రదేశాల్లో జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి ఇంటికీ క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని, డ్రైడే – ఫ్రైడేను తప్పక అమలుచేయాలని అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతుసేవా కేంద్రాలు, ఆసుపత్రులను సందర్శించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. జూలై 31వ తేదీ లోపు అన్ని గ్రామాలను సందర్శించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికీ 305 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, అధికంగా కౌతాళంలో 32, ఆదోనిలో 24 సమస్యలు ఉన్నాయని త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఆలూరులో నీరు ఉన్నప్పటికీ వాటర్‌మెన్ సమస్యగా మారాడని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సమగ్ర నివేదికతో శుక్రవారం తనను కలవాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఉపాధి హామీ పనులు కల్పించడంలో ప్రగతి చూపాలని, జిల్లాలో 6 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 4.54 లక్షల కార్డులు మాత్రమ యాక్టివ్‌గా ఉన్నాయని, మిగిలిన 1.50 లక్షల కార్డులను యాక్టివ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



భూమిపూజ, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు (టౌన్): నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. ఆయన గురువారం సాయంత్రం నగరపాలక పరిధిలోని 23వ వార్డు శ్రీరామనగర్‌లో రూ.20 లక్షలతో సీసీ డ్రైనేజీ కాల్వలు, రూ.39 లక్షలతో సీసీ రోడ్లు, 17వ వార్డు చాణిక్యపురి కాలనీలో రూ.70 లక్షలతో కమ్యూనిటీ హాలు, 15వ వార్డు బుధవారపేట శ్మశాన వాటికలో రూ.70 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. ప్రజా సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మంత్రితో కలిసి నగరాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు కైప పద్మలత, పల్లవి, శివమ్మ, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంఈలు షాకీర్, ఏఈ జనార్దన్ పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులతో సమీక్ష

కర్నూలు (టౌన్): రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ నగర పర్యటనలో ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. ఆయన గురువారం నగరపాలకలోని తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రావు నగర్‌లో మరుగుదొడ్లు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ఆనంద్ థియేటర్ ఎదుట డంప్ తొలగించి గ్రీనరీకి ఏర్పాటు చేయాలని, కేసీ కెనాల్‌కు రక్షణ వలయం ఏర్పాటు చేయాలన్నారు. గడియారం ఆసుపత్రిలో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, సిబ్బంది నియామకంపై ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నగర పాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ షాకీర్‌హుస్సేన్, డీసీపీ సంధ్యారాణి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఏసీపీ రంగస్వామి పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తాం

కర్నూలు సిటీ: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆయన గురువారం ఆయన జగన్నాథగట్టులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్ మ్యానిఫ్యాక్చరింగ్ (ట్రిపుల్‌ఐటీడీఎం)ను సందర్శించారు. ఆ ఇనిస్టిట్యూట్ రిజిస్ట్రార్ గురుమూర్తి ఎంపీకి స్వాగతం పలికారు. క్యాంపస్‌ను పరిశీలించిన ఎంపీ అక్కడ అందుతున్న విద్య, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాల గురించి రిజిస్ట్రార్‌ను అడిగి తెసుకున్నారు. క్యాంపస్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, క్యాంపస్ మీదుగా వెళ్లే విద్యుత్ హైటెన్షన్ లైన్లను మార్చాలని రిజిస్ట్రార్ ఎంపీని కోరారు.



ట్రిపుల్‌ఐటీడీఎం క్యాంపస్‌ను పరిశీలిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

- సిల్వర్‌జూబ్లీ కాలేజీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు భరోసా ఇచ్చారు. ఆయన గురువారం ఆ కాలేజీని సందర్శించి సమస్యలపై ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్, స్టాఫ్ కాలేజీలోని సమస్యలపై ఎంపీకి వినతి పత్రాన్ని అందజేశారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆమె గురువారం 41వ వార్డులో సీఎండీఎఫ్ నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వార్డులో సీసీ డ్రైనేజీ, శిల్పా అపార్ట్‌మెంట్ నుంచి డిస్పోజల్ డ్రైయిన్ నిర్మాణ పనులు, కౌసల్య అపార్ట్‌మెంట్ నుంచి విష్ణు టౌన్‌షిప్ వరకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, పురుషోత్తంరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

20న 'భువన విజయం' ప్రదర్శన

కర్నూలు కల్చరల్: శతావధాని బ్రహ్మశ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మ బృందంచే ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో 'భువన విజయం' సాహిత్య రూపకం ప్రదర్శిస్తున్నట్లు సాహితీ సదస్సు వ్యవస్థాపకులు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. సాహితీ సదస్సు స్థాపకులు, ఉస్మానియా కళాశాల విశ్రాంత ఆచార్యులు ఎస్వీ కృష్ణమూర్తి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.